**AKSHARASURYA**
Peer-Reviewed, Multi Lingual E-Journal
Volume – 02, Issue – 01, January 2023.

# జూలూరు గౌరిశంకర్ – దీర్ఘ కవితలు విశ్లేషణ

*డా. గిన్నారపు ఆదినారాయణ*
*తెలుగు సహాయ అధ్యాపకులు*
*యూనివర్సిటి పోస్ట్ గ్ర్యాడ్యూయేట్ కళాశాల,*
*సికింద్రాబాద్, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.*
*మొబైల్ నంబర్ : 9949532456*
*aadi.ginnarapu@gmail.com*

తెలుగు సాహిత్యంలో దీర్ఘకావ్యాలకు ప్రత్యేక ఉంది. దీర్ఘ వచనాలు అనేవి మనకు కవిత్రయుల నుండే కన్పిస్తున్నాయి. దీర్ఘ వచనాలే క్రమక్రమంగా దీర్ఘ కావ్యాలుగా సంతరించుకున్నాయి అని చెప్పవచ్చును. వచన కవితా ప్రక్రియల్లో అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది దీర్ఘకావ్యం. ఈ ప్రక్రియను రచయితలు చాలా పేర్లతో పిలుస్తున్నారు. దీర్ఘకవిత, దీర్ఘకావ్యం, మహాకావ్యం, ఇతిహాసకావ్యం, ఆధునిక ఇతిహాసం, మహేతిహాసం, ఆధునిక కావ్యం అనే పేర్లతో పిలువడం మనకు తెలుగు సాహిత్యంలో కన్పిస్తుంది. ఈ ప్రక్రియకు మూలాలు తిక్కనలోని దీర్ఘ వచనాలు. యుద్ధ దృశ్యాలు వర్ణించే పట్టులో కొన్ని దీర్ఘ వచనాలు వ్రాశారు. అవి సమాస భూయిష్ఠంగా, అలంకార బహుళకంగా, ఒకే కావ్యంగా కూడా ఉంటాయి. తెలుగులో వచన రచనలో తిక్కన ప్రవేశపెట్టిన విధానాన్ని అతని తరువాత కవులందరు కూడా అనుసరించారు అని చెప్పవచ్చు.

తెలుగు సాహిత్యంలో జూలూరు గౌరిశంకర్ దీర్ఘకావ్యాలు ఎక్కువగా రాశారు. ఒక రకంగా చెప్పాలంటే తన సాహిత్యం మొత్తం దీర్ఘకావ్య సాహిత్యంగా చెప్పవచ్చును. తన మొదటి రచన ఎలియస్(1991) అనే దీర్ఘకావ్యంతో తన సాహిత్య ప్రస్తానాన్ని కొనసాగించారు. అలాగే పాదముద్ర(1992) నా తెలంగాణ(1997) సెలబస్ లో లేని పాఠం(1997) రెండు ఆకాశాలు (2000), ఓం నమ: శివాయ(2001) మూడవ గుణపాఠం(2001) కాటు(2002), శవాల కమురు వాసన(2002) మొగిలిచర్ల(2004) నాలుగోకన్ను(2005) సెగ(2008) వంటి దీర్ఘకావ్యాలను జూలూరు గౌరిశంకర్ రాశారు.

## దీర్ఘకవిత :

ధీర్ఘకవిత విశ్లేషణాత్మకత కలది. ప్రణయత్వంతో కూడుకున్నది. దీర్ఘంతో ప్రణయత్వం, కర్ణపేయం సందేశ స్వీకరణ సులువు అవుతుందని అంటారు కవులు. మినీకవితలో కూర్చిన వస్తువు మామూలు పాఠకునికి అర్థం కాకపోవచ్చు. ఆ పదాల తాకిడి అతనిలో అలజడి రేపవచ్చు. పాఠకుని సౌకర్యార్థం, భావ వ్యక్తీకరణ దృష్ట్యా వెలువడిన ప్రక్రియ దీర్ఘకవిత ప్రక్రియ. దీర్ఘకవిత అనగానే మనకు పొడుగు కవిత అని స్పురిస్తుంది. నిజానికి అదే దీని నిర్వచనం. శ్యామల్ రావు ''కొయ్యగుర్రం'' నగ్నముని గారి దీర్ఘ కావ్యమున లాంగ్ పోయెమ్ అని నిర్వచించారు. కవిత కవి అనుకున్న లక్ష్యాన్ని సాదించాలి. మనిషి లోపల కూరుకుపోయిన మాలిన్యాన్ని పారద్రోలాలి. కవిత ద్వారా మానవ సమాజమునకు హితము జరగాలి. ఈ ప్రాతిపాదికా ఆధారంగానే కవితలు వేలువడతాయి.కాని నేడు కొన్ని కవితలు ఆ విధిని నిర్వహించడం లేదనే చెప్పవచ్చు.

## దీర్ఘ కవిత ఆవిర్భావ వికాసం :

దీర్ఘ కవిత వచనంలో అనగా జీవద్భాషలో ఉంటుంది. కాబట్టి పద్యభాష గ్రాంధికభాష, ఛందస్సులను వదిలించుకున్నప్పటికి కవిత్వ తొలి రూపాలను పరిశీలించడం ద్వారా దీర్ఘకావ్య ఆవిర్భావాన్ని తెలుసుకోవచ్చు. కథా

విరహితంగాను, సంక్షిప్తంగాను, జీవద్భాషలోను ఉన్న కవిత్వం మరల ఇతిహాసయుగంలో వలే ''దైర్ఘ్యత ''ను సంతరించుకోడానికి అనుకూలించిన పరిస్థితులని తవ్వి పోయడం ద్వారా దీర్ఘకావ్య ఆవిర్భావ వికాసాలు స్పష్టపడతాయి.

తెలుగుసాహిత్యంలో దీర్ఘకావ్యాలను పరిశీలించినట్లయితే ఏదో ఒక బలమైన సన్నివేశాన్ని అంతస్సూత్రాన్ని, ఒక సిద్ధాంతాన్ని, ప్రత్యేక విషయాన్ని చెప్పినట్లుగా ఉంటుంది. పాఠకుడు విడవకుండా ఏకధారగా చదివేట్లు చేయడం, పాఠకుడి మనసును ఆ సన్నివేశం ద్వారా కదిలించేట్లు చేయడం దీర్ఘకావ్యం యొక్క ప్రత్యేకతగా చెప్పవచ్చును.

నగ్నముని రాసిన కొయ్యగుర్రం కావ్యాన్ని గురించి రాస్తూ ఆచార్య చేకూరి రామారావు ''కావ్యఖండిల్లో ఒకే వస్తువు (అనగా కథకాదు) ఒకే భావం ఉంటుంది. ఒక ఖండికలో భిన్న భావాలను పలికించడం కష్టం. దానికి కొంత విస్తీర్ణత కావాలి. మనం రోజూ చేసే ఖండికల కన్నా పెద్దవిగా ఉంటే తప్ప భిన్న భావాలను చెప్పడం కుదరదు. అంటే మహాకావ్యం కావాలి. మహాకావ్యానికి విస్తీర్ణతే ప్రధానం కాదు కాని అవసరమైన ఒక లక్షణం పెద్ద పాయింటులో అచ్చెయటం వల్లనో, పాదాలుగా విరవడం వల్లనో కవిత్వం కానట్టే విస్తీర్ణత వల్ల ఏదీ మహాకావ్యం కాదు, కాలేదు. ఒక ప్రధాన వస్తువుతో, ఒక తాత్త్విక చింతనతో, సందేశంతో అనేక భావాలతో మూడ్సో కథలేకుండా ''ఆర్గేనిటీ'' అనే లక్షణం కల్గి ఉండి తగినంత విస్తారంగా వున్న దీర్ఘకవితను ఆధునిక మహాకావ్యం అంటున్నాను''(ఆచార్య చేకూరి రామారావు) అని చెప్పడం జరిగింది.

ఆరుద్ర – త్వమేవాహం, అవత్స సోమసుందర్ – అక్షయ తరంగిణి, కాలం వీలునామా, ముక్తచ్ఛాయ, అరచేతిలో లోయలు, వేగుంట మోహన ప్రసాద్ – పద పారిపోదాం, నగ్నముని – కొయ్యగుర్రం, అనుమాండ్ల భూమయ్య – అగ్నివృక్షం, ఆచార్య తిరుమల – అమృతాన్వేషణ, బైరాగి – నూతిలో గొంతుకలు, వరవరరావు – సముద్రం, అఫ్సర్ – సంయుక్త కవిత, ఖాదర్ – పుట్టమచ్చ, సుధేరా – పొలికేక, ఛాయారావు – నిరీక్షణ, యం.ఎస్. సూర్యనారాయణ – మళ్ళీ అమ్మదగ్గరకు, ఆకుమడి, ఎర్నం సత్యం – సుదీర్ఘ జ్ఞాపకం, రఘుబాబు – సంఘటిత స్పర్శ, యన్.కె. లాల్ బనో గులామీ ఛోడో బోలో వందేమాతరం, డా.ఎన్. శైలజ – ఇదేదో చాటుమాటు వ్యవహారమే, సి.నారాయణ రెడ్డి – విశ్వంభర, కె. శివారెడ్డి – ఆసుపత్రి గీతం, ఎన్.గోపి – జలగీతం, జూలూరి గౌరి శంకర్ – నా తెలంగాణ, చెకుముకి రాయి, ఎండ్లూరి సుధాకర్ – వర్గీకరణ, గోసంగి, సుంకిరెడ్డి నారాయణ రెడ్డి – దాలి, వడ్డెబోయిన శ్రీనివాస్ – జెంగ్ ఏ కాశ్మీర్, పడావు, పసునూరి రవీందర్ – లడాయి, వనభట్ల సుబ్బయ్య – వొల్లెడ, మశాల్, ఊర చెరువు, జయశంకరుడు, నదితో ముచ్చట, డప్పోల్ల రమేష్ – వలపోత, చిలకకోల దండోర మొదలైన దీర్ఘకావ్యలు వచ్చాయి.

దీర్ఘకావ్యంలో నిర్మాణ వైవిధ్యం, నిర్మాణ చాతుర్యం ఉంటాయి. కేవలం వాక్య భేదాలతోను, సంకేతిక పద చిత్రాలతోను, భావచిత్రాలతోను నిర్మాణ వైవిధ్యం సాధ్యపడదు. వస్తువులోని గంభీరత చెడకుండా రూప సమగ్రత దెబ్బ తినకుండా నిర్మాణ వైవిధ్యం సాధించాలి. కావ్యాలలో నిర్మాణ వ్యవస్థ ప్రత్యేకంగా ఉండాలి. సందర్భాన్ని బట్టి, కవిత్వంలోని అంతర్గత సమగ్రతను బట్టి, కవి పదజాలాన్ని మార్చుకొంటాడు. సన్నివేశంతో పాటు పదవ్యవస్థ కొత్తగా నిర్మించుకోవడం దీర్ఘ కావ్యంలో తప్పనిసరి.

**జూలూరు గౌరిశంకర్ – దీర్ఘకవితలు విశ్లేషణ:**

గౌరిశంకర్ రాసిన మొట్టమొదటి గ్రంథం ఎలియస్(దీర్ఘకావ్యం)(1992). విద్యార్థి దశ పూర్తవగానే రాసిన మొదటి రచన ఎలియస్. జూలూరు గౌరిశంకర్ 'కాటు' అనే దీర్ఘ కవితలో ఇలా అంటాడు.

''రుతువుల్లేవు పవనాల్లేవ్ / పచ్చని పొలాలు లేవు
రైతు ముంగిట వడ్ల చిలుకలు /కలకలమూ లేదు
మేఘమంటే గిపుడు / వరాల సినుకులు కాదు

కురుస్తున్న నిప్పులు / కునుకులు లేని ఎండలు'' (జూలూరు గౌరి శంకర్, కాటు, పుట : 10)

తెలంగాణ ప్రాంతంలో ఎక్కువగా సాగునీరు లేకపోవడంతో వర్షాన్నే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఇవాళ గ్లోబల్ పర్యావరణ కాలుష్యంతో వర్షాలు తగ్గిపోయాయి. వాటినే నమ్ముకొని జీవిస్తున్న రైతుకు కడగండ్లే మిగిలాయి. ఒక సమాజానికి వెన్నెముక లాంటి రైతే ఇలాంటి పరిస్థితిలోకి నెట్టివేయబడ్డప్పుడు ఆ సమాజం గందరగోలానికి గురయ్యే అవకాశం ఉంటుంది.

అలాగే 1969 ఉద్యమంలో సైతం 350 మంది అమరులైనప్పటికీ స్వార్థ రాజకీయాలకు తెలంగాణ బలయింది. తెలంగాణ నేల చరిత్రంతా త్యాగాల పునాదుల మీదనే నిర్మాణం కన్పిస్తుంది అందుకే గౌరిశంకర్ చెకుముకిరాయి (2006) అనే దీర్ఘ కవితతో ఉద్యమానికి తన మద్ధతును ప్రకటించారు. 'ఇది ఇక / తెగ దెంపుల సంగ్రామం / తెగ దెంపుల సంగ్రామం /తెగిస్తేనే తెలంగాణ సాధ్యం / నాలుగు వేల ప్రాణాలను / నాడు మేమిచ్చినం / ఆ జైకొట్టిన అమరులు / మాకు కసినేర్పింద్రు/ ఇగ తాడోపేడో' నంటూ తెలంగాణ నుండి పార్లమెంటరీ ప్రాతినిధ్య నాయకత్వంలో ఉన్న ప్రజా ప్రతినిధుల్లో ఉన్న ద్వంద నీతిని, ఊగిసలాట మనస్తత్వం నుంచి బయటకు రావాలని గట్టిగా హెచ్చరిస్తడు. మాట్లాడాల్సిన సందర్భంలోనే తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు మద్ధతుగా మాట్లాడకపోతే చరిత్ర క్షమించదంటాడు.

**రైతుల వ్యథలు :**

తెలుగు ప్రాంతంలో రైతుల బాధలు చెప్పనంత ఎత్తులో ఉన్నాయి. శ్రమను నమ్ముకొని పంచభూతాలతో జీవనం సాగిస్తూ తాను కష్టపడి ఇతరులను సుఖపెట్టే యోచనలో ఉన్న వ్యక్తి రైతు అని చెప్పవచ్చు. రైతుల వ్యథలను గురించి కవి జూలూరు గౌరిశంకర్ తన దీర్ఘ కావ్యాలలో వివిధ అంశాలను ప్రస్తావించారు.

''ఇప్పుడు మనం తాగుతున్న వన్నీ
పచ్చిగా చెప్తే కన్నీళ్లే
వెచ్చగా వుంటే కోలా పెప్సీలే
ఏందీ కళ్లిట్లా కన్పిస్తున్నాయ్
వొణుకుతున్న వేళ్ళమధ్యలో కలం
కవి కంఠం కరకుదా కరువుదా కటకటదా'' ( కాటు, జూలూరు దీర్ఘకవితలు : 103)

ఇలాంటి ఇబ్బందులు రైతులు ఎదుర్కొంటూ ఎంతో మంది అసువులు బాస్తున్నారు. అయినా రైతును రాజుకాదు కదా రాకాసి రాక్షసిగా చేస్తున్నారు. దేశానికి వెన్నుముఖ రాజు. అలాంటిది ఈ దేశంలో ఏమి అడగకుండా మోసపోయేది రైతు మాత్రమే అని పండిరచిన పంటకు గిట్టుబాటు ఇవ్వకుండా బ్రోకర్లచే పంటలను కొంటు ఆర్థికంగా నష్టాలకు గురిచేస్తున్నారు. ఇలా కవి రైతుకు సంబంధించిన ఎన్నో విషయాలను చాలా సూటిగా స్పష్టంగా తెలియజేశారు. అందుకే కవి ఇలా అంటాడు.

''పచ్చపురుగే ఆత్మహత్య / కురవని వానే సామూహిక హత్య
సావు ఖర్చులివ్వలేని పాలకులూ / పంటపానాలకు పరిహారమా
సాగరమా నువ్వు సెయ్యాల్సింది / సేసినావుగా
పీకలాక నీళ్ళున్నప్పుడూ నాపైన నిరసనేగా / నన్ను ఎడంగనే సూస్తివి
ఎడంకాలవ సాక్షిగా / ఎఱ్రసెలకల సాపిస్తున్నయ్
నువ్వు ఎండిపోతేకూడా నాపైన / సవతి ప్రేమేగా
దోసెడు నీళ్ళివ్వలేని నది కథే నా ఆత్మకథ'' (జూలూరు దీర్ఘకవితలు : 107)

ప్రభుత్వాలు మొత్తం కూడా రైతుపైన సవతి ప్రేమ గాని కన్నతల్లి ప్రేమ ఉండదు అని స్పష్టం చేశారు కవి. ఇక్కడ పంట పండలేక రైతులు ఆత్మహత్య చేసుకుంటుటే పంటలకు నీళ్ళు ఇవ్వని వ్యక్తి పంటలకు పరిహారం ఇవ్వడం అంటే ఎలా నమ్మేది అని చురకలు వేస్తూనే కవి రైతు జీవన గాధను కళ్ళకు కట్టినట్లు చూపించారు.

**కరువు చిత్రణ :**

కరువు కాటకాలకు ప్రతీక తెలంగాణ ప్రాంతం. తెలంగాణ ప్రాంతంలో కరువు అనేది చాలా సందర్భాల్లో వచ్చింది. కరువు రావడం వల్ల అనేక మంది ఇబ్బందులకు గురి అయ్యారు. ముఖ్యంగా రైతన్నలు అనేక విధాలుగా నష్టపోయారు రైతు నష్టపోయాడు అంటే సమాజం మొత్తంకూడా నష్టపోయినట్లుగా భావించాలి. అందుకే జూలూరు గౌరిశంకర్ కరువు గురించి ఇలా ప్రస్తావిస్తారు.

"కరువు కఠిన పదం / కానరాకుండా కాలాన్ని మింగుద్ది
కనికరంలేని వధే కరువు / ఆకలని మెలితిప్పి
బతుకుల్ని కల్లోలం చేసేదే కరువు / అన్నం పెట్టిన చేతుల్నే
యాచకం చేసిన కరువు / పల్లెను చంపి
వలసకు ప్రాణం పోసేదే కరువు / కరువుల్ని సోదిలలేకుండా తరిమే పాదాలు
కరువు కంట్ల కారంచల్లే చేతులవైపు నా చూపులు" (జూలూరు దీర్ఘకవితలు :115)

సమాజంలో కరువు రావడం వల్ల రైతన్న అందరూ భూములు గ్రామాలు వదిలేసి వలసకు బయలుదేరి కూలీలుగా మారుతుంటారు. ముఖ్యంగా పట్టణాలకు వెళ్ళి ఏదో దొరికన కంపెనీలో ప్రవేశించి వచ్చిన డబ్బుతో కుటుంబాన్ని చాలిచాలని జీవతంతో కుటుంబాన్ని గడుపుతుంటారు. కరువు రావడమంటే గ్రామాలను హత్య చేయడం తో సమానంగా భావిస్తారు కవి.

**రాజ్యాధికారం :**

దళిత బహుజనులకే రాజ్యాధికారం అనీ ప్రతిపాదన చేశాడు. శ్రమశక్తి, చరిత్ర నిర్మాణ సామర్థ్యం దేశరాజకీయాలను శాసించగల బలం గల బహుజనులు అల్పసంఖ్యాక పాలకుల దయా దాక్షిణ్యాలపైన ఆధారపడి బతికే అసహజ చరిత్రను ఈ కావ్యం తీవ్రంగా ప్రతిఘటించింది. అసమ సమాజం సమసమాజం కావడానికి బిసిల రాజ్యాధికారమే మార్గమని, దానికోసం యుద్ధం చేయాలని అంటాడు.

"ఒకసారి చౌదరి
మరోసారి రెడ్డి
ఇంకోసారి నాయుడు
మరి ఈ సారి
బిసి బతుకు వేసారి
అయామ్ సారి" (నాలుగో కన్ను : జూలూరు దీర్ఘకవితలు : 161)

అంటూ సమాజంలో అన్ని వర్గాల వారు రాజ్యమేలుతుంటే మేం మాత్రం మా బతుకులను చక్కదిద్దుకునే కాడనే ఉన్నాం. ఈసారి మా హక్కులు మాకు కావాలి. మా పాలన మేం పాలించుకోవాలిన అని బహుజన దృక్పథంతో రాశారు కవి.

**ముగింపు :**

గౌరిశంకర్ రాసిన దీర్ఘకావ్యాలు మొత్తం అర్థం చేసుకున్నట్లయితే బహుజనులు, దళితులు, స్త్రీలు పడుతున్న అంశాలపై రాసి నేడు స్వరాష్ట్రం సిద్దించాక సకారాత్మక కవిత్వం రాస్తూ ప్రతి సూక్ష్మ విషయాన్ని రికార్డ్ చేస్తూ తానే ఒక డిజిటల్ లైబ్రరీగా మారారు గౌరీశంకర్. మొత్తం సాహిత్య ప్రయాణాన్ని విహంగ వీక్షణం చేస్తే విప్లవ భావజాలం నుంచి దళిత వాదం మీదుగా, బీసీ అస్తిత్వం వైపు ప్రయాణం చేసి అక్కడ నుంచి వలస పాలన నుంచి విముక్తి గీతం ఆలపించే వరకు

నాలుగు దశలు కనిపిస్తాయి. ఈ నాలుగు దశలు వేరు వేరు కాదు. నాలుగు దశలూ ఒక అఖండమైన అస్తిత్వంలో భాగాలుగా కన్పిస్తాయి. కాబట్టి గౌరిశంకర్ రాసిన మొత్తం దీర్ఘకావ్యాలలో శ్రమైక జీవుల వ్యథలు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

ఆధారగ్రంథాలు :

1. గౌరిశంకర్, జూలూరు, ముండ్లకర్ర, స్పృహ సాహితీ సంస్థ కోదాడ, నల్లగొండ. 2004.
2. గౌరిశంకర్, జూలూరు, జూలూరు దీర్ఘకవితలు, స్పృహ సాహితీ సంస్థ కోదాడ, నల్లగొండ. 2012
3. గౌరిశంకర్, జూలూరు, నా తెలంగాణ , స్పృహ సాహితీ సంస్థ కోదాడ, నల్లగొండ. 1997
4. గౌరిశంకర్, జూలూరు, సెగ, స్పృహ సాహితీ సంస్థ కోదాడ, నల్లగొండ. 2008.